పశువుల్లో సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణానికే ప్రమాదం
- 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వైద్య సేవలు

గడివేముల: వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పాడి రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్ల వచ్చు. దీంతో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంప కందార్లు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు పేర్కొంటున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వెంటనే 1962 టోల్ ఫ్రీ నంబరు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి మరీ చికిత్స అందిస్తారని చెబుతున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి ఎక్కువగా ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కూడా కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.



పెసరవాయిలో ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్ (ఫైల్)

కలుషిత నీటితో జలగ వ్యాధి

మురుగు నీరు, కాల్వల్లోని కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. వ్యాధి బారిన పడిన పశువులు మేత తినడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి క్షీణిస్తుంది. జలగ వ్యాధి బారిన పడిన పశువులకు మంద నుంచి వేరు చేయాలి. డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీ లీటర్ల నీయోజడ షెస్‌ను అందించాలి.

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో వాటి ఎదుగుదలకు అవకాశం ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. పశు సంవర్ధక శాఖ ముందు జాగ్రత్త చర్యగా ఆరునెలల కోసారి పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తోంది. ఈ ఏడాది కూడా నట్టల నివారణ మందులు సకాలంలో అందించారు.

మండలంలోని పశు సంపద వివరాలు	
తెల్లవి	5310
నల్లవి	8245
గొర్రెలు	18424
మేకలు	8865
కోళ్లు	18258

ఇటాస్ వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వచ్చే వ్యాధుల్లో చిటుకు ఒకటి. ఇది సోకినపుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూలై, ఆగస్టు మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించడం వల్ల వాటిని నివారించవచ్చు.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ వచ్చి శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు హెచ్ఎస్ టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

సకాలంలో చికిత్స చేయించాలి



పశువుల్లో అనారోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో పశువులకు కాలానుగుణ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు స్థానిక పశు వైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు. – డాక్టర్ సాయి హరిణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గడివేముల

క్లుప్తంగా

మొరాయించిన బస్సు



హైవేలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

పాణ్యం: నంద్యాల ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్డినరీ బస్సు పాణ్యంలో మొరాయించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సోమవారం నంద్యాల నుంచి కర్నూలుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు పాణ్యం వద్ద చందమామ హోటల్ వద్దకు రాగానే మొరాయించి నిలిచిపోయింది. దీంతో మరో బస్సు వచ్చేంత వరకు ప్రయాణికులు పడిగాపులు కాశారు. అరగంటకు పైగా వేచి చూసిన తర్వాత ప్రత్యామ్నాయంగా మరో బస్సు రావడంతో ప్రయాణికులు వెళ్లిపోయారు.

తైక్వాండోలో ప్రతిభ



బంగారు పతకం సాధించిన దివ్యశ్రీ

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు తైక్వాండో మాస్టర్ వెంకటేశ్వర్లు, కోచ్ నాగన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీన గుంటూరు జిల్లా, కావలిలోని యూనిక్ మార్షల్‌ఆర్ట్స్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గ్రామానికి చెందిన ఉషాకిరణ్ పబ్లిక్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న దివ్యశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు చెప్పారు. ఫస్ట్ ఇంటర్ స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 29 కేజీల విభాగంలో ప్రతిభ చూపిన దివ్యశ్రీ బంగారు పతకం సాధించడం పట్ల ప్రత్యేకంగా అభినందించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కల్లూరు: నగరంలోని వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 21వ వార్డు ఎన్జీఓ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ–2 లో రూ. 48.32 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ రవీంద్రబాబు శంకుస్థాన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రాధాన్యతలను అనుసరించి వార్డులో పనులు చేస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కాంట్రాక్టర్లు ఆయా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు పెట్టిన దుండగులు

కర్నూలు: నగర శివారు కోడుమూరు రోడ్డులోని గురుబ్రహ్మ నగర్‌లో ఇంటి ముందు నిలిపిఉంచిన ఆటోకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. కాలనీలో నివాసముంటున్న మహబూబ్ బాషా ఆటోతోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన ఆటోను ఇంటి ముందు నిలిపి ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆటో తగలబడుతుండగా స్థానికులు కేకలు వేయడంతో ప్రజలు గుమికూడి నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆటో సగానికి పైగా కాలిపోయింది. ఘటనపై బాధితుడు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నన్నూరు వాసికి డాక్టరేట్



కర్నూలు సిటీ: ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన డి.జయనారాయణ రెడ్డి జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆయన వ్యవసాయ రంగాన్ని డేటా శక్తితో ఆధునీకరించేందుకు లోతైన పరిశోధన చేశారు. డీప్ లెర్నింగ్ ఆధారంగా పంటల దిగుబడి, అంచనా అనే అంశంపై ఆచార్య ఎం.రుద్ర కుమార్ మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

ఈహెచ్‌ఆర్‌తో పనిభారం

కర్నూలు (హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదు వల్ల యూడీసీలపై పనిభారం పెరుగుతుందని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు చెప్పారు. ఈ మేరకు సోమవారం వారు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పీహెచ్‌సీలలో ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర వ్యవహారాలకు సంబంధించి యూడీసీలపై పనిభారం ఎక్కువగా ఉందని, ఇప్పుడు మళ్లీ మధ్యాహ్నం వరకు ఈహెచ్ఆర్ నమోదు చేయాలని ఆదేశించడం వల్ల మరింత ఇబ్బంది అవుతుందని వారు పేర్కొన్నారు.

నేడు, రేపు యోగాంధ్ర కార్యక్రమాలు

కల్లూరు: మండలంలోని 15 గ్రామ సచివాలయాలలో మంగళ, బుధవారం యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎ.గోకులపాడు, బస్తిపాడు, బొల్లవరం, చిన్నటేకూరు, కె.మార్కాపురం, కొంగనపాడు, నాయకల్లు, బుధవారం పర్ల–1, పర్ల–2, పెద్దటేకూరు, పుసులూరు, సల్కాపురం, తడకనపల్లె, ఉలిందకొండ–1, ఉలిందకొండ–2 గ్రామ సచివాలయాల్లో యోగాపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీఓ పేర్కొన్నారు.

బెల్ట్ షాప్‌లపై చర్యలు తీసుకోవాలి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె బెల్ట్‌షాప్‌లు జోరుగా సాగుతున్నాయని ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి మండిపడ్డారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు ఎక్కువయ్యాయని, నిత్యం జిల్లాస్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి అధికారుల వరకు ఆయా గ్రామాల మీదుగా వెళ్తున్నా వారికి కనపడటం లేదన్నారు. అంతేగాక గ్రామంలో పదుల సంఖ్యలో కంకర ఫ్యాక్టరీలు ఉన్నాయని, వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారన్నారు. అలాంటి గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాప్‌లు నిర్వహించడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు పూర్తిస్థాయిలో బెల్ట్‌షాప్‌ల నిర్వహణపై ఉక్కుపాదం మోపాలని కోరారు.

వాగు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పాణ్యం: మండల కేంద్రంలో ఓ ప్రయివేట్ పాఠశాల వెనుక భాగంలో ప్రవహించే వాగును యాజమాన్యం ఆక్రమించుకుందని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆక్రమణకు గురైన వాగును పరిశీలించి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఏఐఎఫ్‌బీ నాయకులు వనం వెంకటాద్రి, మాలమహానాడు నాయకులు దేవదత్తు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 1200లో ఆరెకరాల్లో వాగు విస్తీర్ణం ఉందన్నారు. ఈ వాగును ఆక్రమించుకోవడంతో వెడల్పు తగ్గిందని చెప్పారు. దీంతో వర్షాకాలంలో వరద ప్రవాహం సమయంలో పంట పొలాల్లోకి నీరు వెళ్లి పంటలు కోతకు గురౌతున్నట్లు చెప్పారు. వాగును కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్ ఉద్యమం ప్రకటిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.



ఆక్రమణకు గురైన వాగును చూపుతున్న ప్రజాసంఘాల నాయకులు

భూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు సమస్యలు తెలుపుతున్న రైతులు

సి.బెళగల్: భూ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంకు అర్జీలు ఇచ్చారు. సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి, కొత్తకోట, పోలకల్, పలుకుదొడ్డి తదితర గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వీఆర్వోలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఏఈఓ హిమబిందు పాల్గొనగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనే నాయక్, వెంకట్‌ప్రకాష్ హాజరయ్యారు.

సారా విక్రేతపై కేసు నమోదు

కర్నూలు: కర్నూలు బంగారు పేటలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదే కాలనీకి చెందిన నీలిషికారి మాధవి సారా విక్రయాలు జరుపుతుండగా తనిఖీ చేసి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మాధవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది సుదర్శన్ రాజు, మధు, రామలింగయ్య, ఈయన్న, చంద్రపాల్, లక్ష్మి, సువర్ణమ్మ పాల్గొన్నారు.

యోగాపై నేటి నుంచి శిక్షణ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో నేటి నుంచి మూడు రోజుల పాటు యోగాపై గ్రామ స్థాయి శిక్షకులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. యోగాంధ్ర మాసం కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో శిక్షకులకు మంగళవారం నుంచి ఈనెల 31వ తేది వరకు శిక్షణ ఇస్తారన్నారు. గ్రామ స్థాయిలో ఎంపిక చేసిన 13 మంది శిక్షకులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

గోరుకల్లులో కరెంట్ కష్టాలు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో కరెంట్ కష్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి గ్రామానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో కూడా సమాచారం లేకపోవడంతో ప్రజలు అధికారులపై మండిపడ్డారు. అంతేకాక లైన్‌లు మార్చడంతో తరచూ ఈ సమస్య తలెత్తుతున్నట్లు వాపోయారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా లేక చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఉక్కపోత, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులు విద్యుత్ కోతలు విధించే సమయాన్ని తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తారంగా వర్షాలు

సి.బెళగల్: మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత వారం రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తుండగా ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీనితో మండలంలో 6.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల సహాయ గణాంక అధికారి (ఏఎస్ఓ) ఆదినారాయణ తెలిపారు. కాగా సోమవారం సాయంత్రం సైతం మండల వ్యాప్తంగా చిరుజల్లులు కురిశాయి.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

కల్లూరు: ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు వారికి సేవ చేయడం మానుకొని కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని సీపీఎం నాయకులు విమర్శించారు. సోమవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు చింతలముని నగర్, ఈశ్వరప్ప నగర్‌లలో «మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు – పాత మీటరే ఉండాలి» అంటూ సీపీఎం ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప అన్నారు. ఇప్పటికే ప్రజలు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వం అదనపు భారం వేస్తోందన్నారు. స్మార్ట్‌మీటర్ల ఆలోచనను విరమించుకొని పాత మీటర్లనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామృష్ణ, శ్రీనివాసులు, పరమేష్, లక్ష్మన్న, సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లు వద్దంటూ స్టిక్కర్లు అతికిస్తున్న సీపీఎం నాయకులు

రోడ్డుపైనే మరుగుదొడ్డి నిర్మాణం

కర్నూలు (టౌన్): నగరంలోని జొహరాపురం వద్ద ఓ వ్యక్తి రోడ్డుపైనే మరుగుదొడ్డి నిర్మిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని అదే కాలనీకి చెందిన అయ్యస్వామి, శ్రీనివాసులు, ఈరన్న, ఖాదర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, విన్నపాలను అర్జీల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో 21 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. సమస్యలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రాలు ఇస్తున్న నగరవాసులు

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- అశోక్‌నగర్‌లోని తమ కాలనీల్లో మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు రామలక్ష్మమ్మ, మద్దయ్య విన్నవించారు.
- శ్రీనివాస నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వలను పూర్తి చేయాలని స్థానికులు క్రిష్ణయ్య, రమాదేవి, రమేష్ అభ్యర్థించారు.
- ధర్మపేటలో వీధి దీపాలు వెలగడం లేదని, వీధి కుక్కలు వెంటపడుతున్నాయని కాలనీ వాసులు దాసన్న ఫిర్యాదు చేశారు.

'అత్యవసరమైతే'.. పరుగే!

రైతుబజారులో పొదుపు మహిళలే రోజూ 60 మంది వరకు ఉంటారు. దళారీలు, రైతులు కలిపి 350 మందికి పైమాటే. విని యోగదారులు రోజూ 2 వేల మందికిపైగా వచ్చిపోతుంటారు. ఆదివారాల్లో వీరి సంఖ్య 5 వేలు దాటుతుంది. ఇంతటి రద్దీ ప్రాంతంలో టాయ్‌లెట్ బ్లాక్‌లకు తాళాలు వేయడంతో మలమూత్రాలకు వెళ్లేందుకు దిక్కులు చూడాల్సి వస్తోంది.

- రైతుబజారు మరుగుదొడ్లకు తాళం
- సీఎం వచ్చి వెళ్లి పది రోజులైనా లభించని మోక్షం
- నిత్యం వందలాది మంది రాకపోకలు
- మహిళా రైతుల అవస్థలు వర్ణనాతీతం
- ఉపయోగంలోకి రాని కంపోస్టు మిషన్
- కూరగాయల వ్యర్థాలతో పరిసరాలు దుర్గంధం





పురుషులు, మహిళల టాయ్‌లెట్ బ్లాక్‌లకు తాళాలు వేసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ప్రచార ఆర్భాటం తప్పితే ఎవరికీ ఎలాంటి ప్రయోజనం లేదనేందుకు కర్నూలు రైతు బజారు తాజా దుస్థితి నిదర్శనం. కర్నూలు సి.క్యాంపు రైతుబజారు రాష్ట్రంలోని టాప్ ఐదింటిలో ఒకటిగా గుర్తింపు పొందింది. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర మండలాలకు చెందిన రైతులకు ఇది అనుకూలం. ఈ నెల 17న ముఖ్యమంత్రి రైతుబజారులో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన రాక నేపథ్యంలో అప్పటికప్పుడు రైతు బజారుకు మెరుగులు దిద్దారు. ఆ కార్యక్రమం ముగియగానే.. రైతు బజారులోని టాయ్‌లెట్స్‌కు తాళాలు పడ్డాయి. సీఎం పర్యటన ముగిసి పది రోజులు గడిచినా ఇప్పటికీ తాళాలు తెరుచుకోకపోవడంతో మలమూత్రాల విసర్జనకు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. వందలాది మంది రాకపోకలు సాగించే రైతుబజారులో నెలకొన్న ఈ పరిస్థితికి ప్రతి ఒక్కరూ శాపనార్థాలు పెడుతున్నారు. మరీ ముఖ్యంగా మహిళల అవస్థలు వర్ణనాతీతం.

వినియోగంలోకి రాని కంపోస్ట్ మిషన్

రైతుబజారులో ప్రతి రోజు దాదాపు 2 టన్నుల మేర కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. వీటితో కంపోస్ట్ మిషన్ ద్వారా ఎరువు ఉత్పత్తి చేసి అమ్ముకునే విధంగా నగర పాలక సంస్థ కంపోస్ట్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిని ముఖ్యమంత్రి ఈ నెల 17న ప్రారంభించారు. ఈ మిషన్ సామర్థ్యం 200 కిలోలు మాత్రమే. ఒక్కసారి వ్యర్థాలతో నింపితే 15–20 రోజులకు ఎరువు తయారవుతుంది. రైతుబజారులో రోజూ ఉత్పన్నమయ్యే వ్యర్థాలు 2 టన్నులు. కంపోస్ట్ మిషన్ వినియోగించాలంటే రంపపు పొట్టుతో పాటు కెమికల్స్ కూడా అవసరం. వీటిని నగరపాలక సంస్థ కానీ, ప్రభుత్వం కానీ సరఫరా చేయడం లేదు. దీంతో కంపోస్ట్ మిషన్ వృథాగా ఉండిపోయింది. ఫలితంగా వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేస్తుండటంతో రైతుబజారు దుర్గంధం వెదజల్లుతోంది.



వృథాగా మారిన కంపోస్ట్ మిషన్



రైతుబజారులోని వ్యర్థాలు

ఎక్కడికి పోవాలో దిక్కుతోచదు

ఉదయం వస్తే సాయంత్రం ఒక్కోసారి రాత్రి 8–9 గంటల వరకు రైతుబజారులోనే ఉండాల్సి వస్తుంది. ఇక్కడి టాయ్‌లెట్ బ్లాక్‌లను మూసి వేసి తాళాలు వేయడంతో అత్యవసరమైతే ఎక్కడికి పోవాలో దిక్కుతోచడం లేదు. మేమంటే బయట ఎక్కడో ఒకచోట కానిచ్చేస్తాం. ఆడోళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు.
– నాగరాజు, రైతు, పడిదెంపాడు, కర్నూలు

తాత్కాలికంగా మూసివేశాం

రైతుబజారులో టాయ్‌లెట్స్ బ్లాక్ రీమోడల్‌కు రూ.7 లక్షలు మంజూరయ్యాయి. సీఎం వచ్చే ముందు మరమ్మతులు చేపట్టాం. క్యూరింగ్ కావాల్సి ఉండటంతో తాత్కాలికంగా మూసివేశాం. మరమ్మతు పనులు పూర్తయ్యాక అందుబాటులోకి తీసుకొస్తాం.
– కళ్యాణి, ఎస్టేటు ఆఫీసర్, సీ.క్యాంపు రైతుబజారు

కడప బందోబస్తుకు తరలివెళ్లిన పోలీసులు

కర్నూలు: కడపలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర మహానాడు బందోబస్తు విధులకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 1200 మంది వివిధ హోదాల్లోని పోలీసులు తరలివెళ్లారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 60 మంది సీఐలు, 90 మంది ఎస్ఐలు, 130 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 550 మంది కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ విభాగం నుంచి 53 మంది, మహిళా పోలీసులు 75 మంది, హోంగార్డులు 200 మంది, ఏఆర్ విభాగం నుంచి వివిధ హోదాల్లో ఉన్న సిబ్బంది 87 మంది, ఆరు స్పెషల్ పార్టీ బృందాలను మహానాడు బందోబస్తు విధులకు నియమించడంతో ప్రత్యేక వాహనాల్లో కడపకు వెళ్లారు.

ఇద్దరు మహిళలకు అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం కోలుకున్న మహిళలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): పోర్టల్ హైపర్‌టెన్షన్ అనే అరుదైన సమస్యతో బాధపడుతున్న ఇద్దరు మహిళలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించి ప్రాణం పోశారు. వివరాలను జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ హరిచరణ్‌తో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సోమవారం తన చాంబర్‌లో తెలిపారు. వాంతుల్లో రక్తం వస్తుండటంతో పాములపాడుకు చెందిన ఎలీషారాణి(15) ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు పరీక్ష నిర్వహించగా అన్నవాహిక వేరిసెస్‌తో కూడిన పోర్టల్ హైపర్‌టెన్షన్‌గా నిర్ధారణ అయ్యింది. హిమోగ్లోబిన్ 6 గ్రాములు, ప్లేట్‌లెట్‌లు 60వేలుగా ఉండటంతో ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా ప్లేట్‌లెట్ కౌంట్ 5లక్షలకు పెరిగింది. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుంటుంది.

- గర్భాశయంలో రక్తస్రావంతో అనంతపురం జిల్లా బాల వెంకటాపురం గ్రామానికి చెందిన పర్వీన్ (29)ఆసుపత్రికి వచ్చారు. ఈమెకు కూడా పోర్టల్ హైపర్‌టెన్షన్ నిర్ధారణ అయ్యింది. ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా ప్రాథమికంగా 50 వేలు ఉన్న ప్లేట్‌లెట్లు 4 లక్షలకు పెరిగాయి. ప్రస్తుతం ఆమె కూడా పూర్తిగా కోలుకుంది.
- శస్త్రచికిత్సలను జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ జయరామ్‌తో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్‌బాషా, డాక్టర్ ప్రణీత్, అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రఘు ప్రవీణ, డాక్టర్ సంధ్య నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు.